క్లుప్తంగా

పుష్పరథంపై చెన్నసోమేశ్వరుడి విహారం



పుష్పరథంపై విహరిస్తున్న స్వామివారు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో శ్రీచెన్నసోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి పుష్పరథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయం నుంచి స్వామివారి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించిన పుష్పరథంపై కొలువుదీర్చారు. మేళతాళాల నడుమ ప్రధాన వీధిలో ఘనంగా ఊరేగించారు. బుధవారం రాత్రి కూడా గ్రామంలో పుష్పరథోత్సవం జరగనుంది. పుష్పరథాలు గురువారం రాత్రితో ముగుస్తాయని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

కేసీ కాల్వకు 81 క్యూసెక్కుల నీరు

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు బుధవారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో కేవలం 0.069 టీఎంసీల నీరు ఉన్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా గోకారమయ్య ఉరుసు



గంధాన్ని దర్గాకు తీసుకెళుతున్న భక్తులు

సి.బెళగల్: మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో గోకారమయ్య ఉరుసు బుధవారం వైభవంగా జరిగింది. గ్రామంలోని కేవీ కిరణ్ ఇంటి నుంచి మంగళవారం రాత్రి ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి గంధం, జెండాలు, గుర్రాలతో మేళతాళాల నడుమ ఊరేగింపుగా దర్గాకు వెళ్లారు. బుధవారం ఉదయం 8 గంటలకు దర్గాకు చేరుకోగా, గ్రామ పెద్దలు, భక్తులు దర్గాలో జెండాలను ఆవిష్కరించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. గురువారం కిస్తీ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకుడు శరత్‌కుమార్ తెలిపారు.

పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన ఏడీ

సి.బెళగల్: స్థానిక మోడల్ స్కూల్‌లో బుధవారం జరిగిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షను ఏడీ శామ్యూల్ పాల్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఆదామ్‌బాషా తెలిపారు. కొత్తకోట జెడ్పీ హైస్కూల్‌లోని ఏ సెంటర్‌లో నలుగురు, బీ సెంటర్‌లో ముగ్గురు, ఏపీ మోడల్ స్కూల్‌లో ముగ్గురు, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్‌లో ఇద్దరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదుగురు చొప్పున మొత్తం 17 మంది విద్యార్థులకు హాజరుకాలేదని వెల్లడించారు. సి.బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీస్ సిబ్బందితో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

పాణ్యం: మండలంలో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని.. గ్రామంలో ఓటర్లను ప్రభావితం చేసే ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ అన్నారు. బుధవారం పాణ్యంలోని రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, గ్రామాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలు, హోర్డింగ్‌లకు ముసుగు వేశామన్నారు. శిలాఫలకాలు, వాటిపై ఉన్న ఫొటోలు కనిపించకుండా చూడాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు, బహుమతులు, తాయిళాయి తదితర వాటిపై ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించినట్లు తెలిపారు. వీరు ప్రతి గ్రామంలో పర్యవేక్షణ చేస్తుంటారని చెప్పారు. అనంతరం మోడల్ కోడ్ కండక్ట్‌పై వివరించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ది నెరవాడ సుంకులాపరమేశ్వరి ఆటో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. మెట్ట వద్ద వేల సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, బాటసారులు రాకపోకలు సాగిస్తుంటారు. నెరవాడ గ్రామ సర్పంచ్ లింగాల శారదమ్మ, ఆమె భర్త లింగాల రాంభూపాల్‌రెడ్డి సహకారంతో దీనిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆటో డ్రైవర్లు శివనాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గంగన్న, పీరా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల తొలగింపు

కల్లూరు: మండల పరిధిలోని పుసులూరు గ్రామానికి చెందిన వలంటీర్లు అల్వాల ఆనంద్, టి.సోమన్నలను విధుల నుంచి తొలగించినట్లు మండల అధికారులు బుధవారం తెలిపారు. ఈ నెల 18న నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారని ఎన్నికల కంప్లైంట్ సెల్ (కలెక్టర్) కాల్ సెంటర్‌కు ఫిర్యాదు వచ్చినందున, విచారణ చేసి తొలగించినట్లు వెల్లడించారు.

రమణీయం.. యాగంటీశ్వరుడి రథోత్సవం

- శివనామ స్మరణతో మార్మోగిన ఎన్ కొంతలపాడు
- అలరించిన సినీ సంగీత విభావరి
- ముగిసిన స్వాములవారి ఆరాధనోత్సవాలు



అశేష భక్తజనం మధ్య సాగుతున్న స్వాముల వారి రథోత్సవం

ఓర్వకల్లు: మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో వెలసిన అంబాసహిత యాగంటీశ్వర స్వాముల రథోత్సవం బుధవారం తెల్లవారుజామున రమణీయంగా సాగింది. స్వాముల వారి ఆరాధనోత్సవాలలో భాగంగా ఆలయ ఈఓ మద్దిలేటి పర్యవేక్షణలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మద్దయ్య ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు ఉరుకుందయ్యాచారి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఉత్సవమూర్తిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తిని పల్లకీలో ఆశీనులను గావించి డప్పులు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం నుంచి రథశాల వద్ద చేర్చారు. సంప్రదాయ పద్ధతిలో రథానికి రథాంగ హోమం, రథాంగ బలి సమర్పించి విశిష్ట పూజలు చేశారు. ఆ తర్వాత ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో అధిష్ఠింపజేశారు. హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తులు రథాన్ని ముందుకు కదిలించారు. అశేష భక్తజన సందోహం మధ్య తరలిపోతున్న స్వాముల వారిని కనులారా వీక్షించిన భక్తులు రథంపైకి పూలు, పండ్లు విసిరి తన్మయం చెందారు. స్థానిక నంది స్తూపం వరకు వెళ్లిన రథాన్ని తిరిగి పూర్వ స్థానానికి చేర్చారు. ఎలాంటి అవాంతర పరిస్థితులు తలెత్తకుండా ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

అలరించిన సంగీత విభావరి

స్వాముల వారి ఆరాధనోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన జానపద కళాస్రవంతి వారు ఆలపించిన జానపద గీతాలు ప్రేక్షకులను ఉత్తేజపరిచాయి. స్వాముల వారి ఆరాధన సందర్భంగా బుధవారం రాత్రి పలువురు దాతలు భక్తులకు అన్నదానం, అల్పాహార వసతి కల్పించారు. కర్నూలు బుధవారపేట వాస్తవ్యులు అంబిలి నాగమ్మ, పాపయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు చంద్రమౌళి, అమర్‌నాథ్ రెండు వేల మంది భక్తులకు అల్పాహారం అందజేశారు.



ఉత్సవమూర్తిని పల్లకీలో తీసుకెళ్తున్న దృశ్యం



స్వాముల వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

స్వాములవారిని దర్శించుకున్న కాటసాని

ఉత్సవాల సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి యాగంటీశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఆయన వెంట మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో 50 కుటుంబాలు చేరిక



పార్టీలో చేరిన వారితో ఆదిమూలపు సతీష్, హర్షవర్ధన్ రెడ్డి

కర్నూలు సిటీ: కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు మౌలాలి, మాజీ సర్పంచ్ రాముడు, శ్రీనివాస యాదవ్, రమణ(ఆర్ఎంపీ), స్కూల్ కమిటీ చైర్మన్ నాగన్న సహా 50 కుటుంబాలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆ పార్టీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఎన్నికల్లో కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలపు సతీష్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు.

పది పరీక్షలకు 12మంది గైర్హాజరు

కోడుమూరు రూరల్: కోడుమూరులోని బాలుర, బాలికల హైస్కూల్ ఏ,బీ, మోడల్ స్కూల్, లద్దగిరి హైస్కూల్, గోరంట్ల రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం జరిగిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 1,188 మంది విద్యార్థులకు గాను 1,176 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ వసంతలక్ష్మి తెలిపారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్
- శివరాంపురంలో ఇంటింటి ప్రచారం



గ్రామస్తులకు అభివాదం చేస్తున్న సతీష్

కర్నూలు సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని.. కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్ అన్నారు. బుధవారం కర్నూలు రూరల్ మండలం పరిధిలోని శివరాంపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. కరోనా విపత్కర పరిస్థితులు ఒక వైపు.. ఆర్థిక ఇబ్బందులు మరో వైపు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. పథకాల వల్ల మేలు జరిగి ఉంటేనే మద్దతు ఇవ్వండని చెబుతున్న దమ్మున్న నాయకుడు జగనన్న అని చెప్పారు. తెలుగు దేశం పార్టీతో పాటు మిగిలిన పార్టీల నాయకుల్లా మాట తప్పే నాయకుడు కాదని, చెప్పాడంటే.. ఎంత కష్టమైన చేస్తాడనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చి, జాతీయ స్థాయిలో పేద పిల్లలు రాణించాలనే ఉద్దేశంతోనే ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నారన్నారు. రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో పెట్టుబడికి సహాయం చేసేందుకు రైతు భరోసా రెగ్యులర్‌గా అందిస్తున్నారని, పండించిన పంటను సొంత గ్రామంలోనే విక్రయించుకునేందుకు ఆర్‌బీకే కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి మరోసారి మద్దతు తెలపాలని కోరారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీవై రామయ్యను ఆశీర్వదించాలన్నారు. తమ బతుకులు మార్చిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని స్థానికులు స్పష్టం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహమ్యా, మండల మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, సర్పంచ్‌లు కృష్ణారెడ్డి, బి.శ్రీనివాసులు, సాగర్, ఉప సర్పంచ్ మహాలక్ష్మి, గార్గేయపురం, పసుపుల సొసైటీ చైర్మన్ వినయ్‌కుమార్ రెడ్డి, శేషిరెడ్డి, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శేఖర్, నాయకులు చిన్న లక్ష్మన్న, శేఖర్, మోహన్‌బాబు, గోపాల్, వెంకటేశ్వరరెడ్డి, హరినాథ్‌రెడ్డి, సురేష్, ఏసేపు, వెంకటనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామానికి చెందిన 20 టీడీపీ కుటుంబాలు బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. గ్రామ నాయకులు మహేష్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వాల్మీకులు బి.మధు, నాగమద్దయ్య, దస్తగిరి, రామయ్య, శంకర్, పెద్ద గిడ్డయ్య, చిన్న గిడ్డయ్య, సువర్ణ, మంజుల, లచ్చమ్మ, మాధవి, మారెమ్మతో పాటు 20 కుటుంబాలకు చెందిన కార్యకర్తలకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేశామన్నారు. ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాల వలన మేలు జరిగి ఉంటేనే మద్దతు ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా అడుగుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మునిస్వామి, హనుమంతురెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21వ వార్డులో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న కాటసాని మాధవీలత

కల్లూరు: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పాణ్యం ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే కుమార్తె కాటసాని మాధవీలత, స్థానిక కార్పొరేటర్ అరుణ పిలుపునిచ్చారు. బుధవారం కల్లూరు అర్బన్ 21వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, పలువురు కార్పొరేటర్లు, వార్డులోని స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ చైర్మన్ మృతికి సంతాపం

కర్నూలు (న్యూటౌన్): ఏపీ నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వర్ రావు అకాల మరణానికి చింతిస్తూ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా నాయకులు రమణమూర్తి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నాగేశ్వర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ సంఘానికి, సమాజానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు.

కల్లూరులో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన



పాతకల్లూరులో..



కల్లూరు బాపిస్టు చర్చి ఎదురుగా..

కర్నూలు (న్యూటౌన్): పాత కల్లూరులో యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతోంది. ఇంటి యజమాని అనుమతి లేకుండా అడ్డగోలుగా, బలవంతంగా 'బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీ' పోస్టర్లను అతికించడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. పాతకల్లూరు ఊరు వాకిలి వద్ద, చెంచునగర్, హస్నూర్‌షావలి దర్గా, తెలుగు బాపిస్టు చర్చి, అంబేడ్కర్ విగ్రహం, ఆదర్శ పాఠశాల సమీపంలో, 126వ రేషన్ షాపు ఎదురుగా పోస్టర్లను అతికించారు. అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

భక్తుల కొంగుబంగారం లక్ష్మీమాధవస్వామి

- రేపటి నుంచి గోరంట్ల శ్రీలక్ష్మీమాధవుడి బ్రహ్మోత్సవాలు



శ్రీలక్ష్మీమాధవస్వామి మూలవిరాట్

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ మాధవస్వామి కొలిచేవారి కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 22వ తేదీ శుక్రవారం అంకురార్పణం, రక్షాబంధనం, 23న ధ్వజారోహణం రాత్రి బేరిపూజ సింహోత్సవం, 24న శేషోత్సవం, 25న హనుమంతోత్సవం, 26న కల్యాణోత్సవం, గరుడోత్సవం, 27న గజతోత్సవం, 28న శిఖికోత్సవం, 29న రథారోహణం, 30న శ్రీవారి రథోత్సవం, 31న పారువేట, ఏప్రిల్ 1వ తేదీ హంసవాహనం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి కంకణ విసర్జన కార్యక్రమాలను నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయ చరిత్ర

చోళుల కాలం నాటికే ప్రాశస్త్యాన్ని సంతరించుకున్న గోరంట్ల మాధవాలయానికి దాదాపు వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది. చోళ (క్రీ.శ1105), యాదవ (క్రీ.శ 1210), అరవీటి (క్రీ.శ 1628) రాజుల శిలాశాసనాలు ఇక్కడ లభించాయి. శిలా శాసనాలపై 1937–38 సంవత్సరాల్లో బ్రిటీష్ ప్రభుత్వం సర్వే జరిపించి స్వామికి సంబంధించిన తామ్ర శాసనాలను మద్రాసుకు చేర్చింది. మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో స్వామికి సంబంధించిన మాధవ శతకం, మాధవాష్టకం తాటాకు గ్రంథాల్లో లభిస్తాయి. కాగా పూర్వకాలంలో గోరువంక మహాముని ఈ పరిసర ప్రాంతంలో నివసించారని, అందుకే గోరువంక మహాముని పేరు మీదుగా గోరంట్ల అనే పేరు వచ్చిందని నానుడి. మూడు దశాబ్దాల క్రితం దేవదాయశాఖ ఆలయాన్ని స్వాధీనం చేసుకుంది. స్వామి ఆలయానికి 704.54 ఎకరాల భూమి కూడా ఉంది.



ఆలయ గోపురం

శ్రీవారి కల్యాణం ప్రత్యేకత

బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే గరుడోత్సవం రోజున శ్రీవారి కల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహిస్తారు. స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని పురస్కరించుకుని నిరుపేద జంటలు వివాహాలను చేసుకోవడం ఇక్కడ విశేషం.

నేటి నుంచి పది రోజులు తరావి నమాజ్



అబ్బాస్‌నగర్‌లోని దారుల్ మజీద్

కర్నూలు (న్యూటౌన్): పవిత్ర రంజాన్ మాసంలో రెండో అషరా ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పది రోజుల పాటు అబ్బాస్‌నగర్ దారుల్ మజీద్‌లో రాత్రి 8.30 గంటలకు తరావి నమాజ్‌లో పాల్గొనాలని జమియత్ ఉలమా జిల్లా అధ్యక్షుడు మౌలానా ఖాజీ అబ్దుల్ మజీద్ సాహెబ్, జిల్లా కార్యదర్శి హాఫీజ్ అబ్దుస్ సమి అసద్ కోరారు. అషరా అంటే రంజాన్ 11వ తేదీ నుంచి 20 వరకు, అలాగే 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి రోజూ తరావి ప్రార్థనలో ఖురాన్‌లోని 3 పారాలు పఠించడం జరుగుతుందని పేర్కొన్నారు. తరావి నమాజ్‌లో ముస్లింలందరూ పాల్గొని అల్లాహ్ కృపకు పాత్రులుకావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ఓర్వకల్లు: కర్నూలు– కడప జాతీయ రహదారిపై ఓర్వకల్లు మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. కర్నూలు ఉంచి నంద్యాల వైపు వెళ్తున్న ఏపీ39వీడీ 1887 నంబర్ గల అప్పి ఆటోను వెనుక నంచి అతివేగంగా వస్తున్న ఏపీ21సీఈ 5400 నెంబర్ గల కారు బలంగా గుద్దడంతో ఒక్కసారిగా ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన గల గుంతలో పల్టీలుకొట్టి పడింది. దీంతో ఆటో డ్రైవర్ రాజుతో పాటు, అందులోని ప్రయాణికులను హుసేనాపురానికి చెందిన రామప్ప, గంగమ్మ దంపతులు, కేశమ్మ, కాల్వ వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ స్వామన్న తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును అదుపులోకి తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే స్వగృహానికి మంత్రి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న మేము సిద్ధం బస్సుయాత్రకు సంబంధించి ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి బుధవారం కర్నూలు విచ్చేశారు. ముందుగా వారు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహానికి వచ్చారు. వారికి ఎమ్మెల్యే పుష్ప గుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు.



మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానం పలుకుతున్న ఎమ్మెల్యే

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

ఓర్వకల్లు : మండల పరిధిలోని ఎస్.కొంతలపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామంలోని యాగంటీశ్వరస్వామి తిరునాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో మొత్తం 16 ఎడ్ల జతలు పాల్గొన్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. ఇందులో గుంటూరు జిల్లా, కండబాలవారిపాలెం, జీపీ చౌదరి బుల్స్ మొదటి స్థానం దక్కించుకోగా, దాతలు రూ.50 వేలను ప్రదానం చేశారు. కర్నూలు మండలం, పసుపుల గ్రామానికి చెందిన గోపాల్ గౌడు వృషభాలు రెండవ స్థానంలో నిలువగా రూ.40 వేలు, గుంటూరు జిల్లా చౌదరి, సంజామల మండలం, ముక్కమల్ల గ్రామానికి చెందిన మాసాని చంద్రశేఖర్‌రెడ్డి (విడిజత) వృషభాలు మూడవ స్థానంలో నిలువగా దాతలు రూ.30 వేలు బహుమతి అందజేశారు. గుంటూరు జిల్లా, కండపాటూరుకు చెందిన కాకాబుల్స్ నాల్గవ స్థానంలో రూ.20 వేలు, వెల్దుర్తి మండలం, కలుగొట్ల రమేష్ నాయుడు ఎద్దులు ఐదో స్థానం సాధించగా రూ.15 వేల చొప్పున బహుమతులను ప్రదానం చేశారు. పోటీలకు సాల్మోన్‌రాజు, అబ్దుల్ కలాం వ్యాఖ్యాతగా వ్యవహరించారు. బహుమతుల ప్రదానోత్సవంలో గ్రామ సర్పంచు మధుకేశన్న, నాయకులు కుమ్మరి మద్దయ్య, కుమ్మరి పెద్ద కేశన్న, రాముగౌడు, పోలకంటి నాగశేషులు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా బందోబస్తు

పాణ్యం : పది పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పాణ్యం సీఐ నల్లప్ప తెలిపారు. బుధవారం పాణ్యం, గడివేముల మండలాల్లోని పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి కేంద్రం వద్ద 144సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రం 100 మీటర్ల అవతల వరకు జనసంచారం ఉండరాదని చెప్పారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

22న ఓటు హక్కుపై అవగాహన

కర్నూలు (న్యూటౌన్) : ఈనెల 22వ తేదీన ఉదయం 10.30 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ భవనంలో జిల్లాలో ఓటు హక్కు కలిగివున్న విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు), వయోవృద్ధులు (సీనియర్ సిటిజన్స్), హిజ్రాలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.